పోలీస్ అమరులను స్మరించుకుంటూ వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని జిల్లా కలెక్టర్  వీపీ గౌతమ్ అన్నారు.

విధి నిర్వహణలో అసువులుబాసిన పోలీసులకు జిల్లా పోలీస్ యంత్రాంగం ఘనంగా నివాళులర్పించింది. శనివారం పోలీస్ అమర వీరుల సంస్మ రణ దినోత్సవం సందర్భంగా జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్  పేరడ్ మైదానంలోని అమరవీరుల స్థూపం వద్ద స్మృతి పరేడ్ నిర్వహించారు. పోలీస్ అమర వీరుల స్థూపం వద్ద జిల్లా అధికార యంత్రాంగం, పోలీస్ అధికారులు, సిబ్బంది, అమరు వీరుల కుటుంబీకులు పూలమాలలు ఉంచి, శ్రద్ధాంజలి ఘటించారు. తొలుత, అమర వీరుల స్మృత్యర్థం సాయుధ బలగాలు పెరేడ్, గార్డ్ ఆఫ్ హానర్ నిర్వహించారు. అనంతరం పోలీసు ఆయుధాలు కిందకు దింపి వందనం చేసి రెండు నిముషాల పాటు మౌనం పాటించారు. గార్డ్ ఆఫ్ హానర్ పెరేడ్ ఇన్చార్జిగా ఆర్ఐ శ్రీశైలం  వ్యవహరించారు.

దేశవ్యాప్తంగా ఈ ఏడాది విధినిర్వహణలో అసువులు బాసిన 189 మంది అమర వీరుల పేర్లను అడిషనల్ డీసీపీ లా&ఆర్డర్ ప్రసాద్ రావు చదివి వినిపించారు.

పోలీసు అమర వీరులకు నివాళులర్పించేందుకు వచ్చిన వారి కుటుంబీకులు, బంధువులు స్థూపం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించే సమయంలో.. తమ వారిని స్మరించుకుని కన్నీటి పర్యంతమయ్యారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..ప్రజల రక్షణ కోసం పోలీసులు తరచూ తమ ప్రాణాలను సైతం లెక్కచేయక విధులు నిర్వహిస్తున్నారని, తీవ్రవాదం, ఉగ్రవాదం, అసాంఘిక శక్తులతో జరిగిన పోరాటాల్లో ఎంతో మంది పోలీసులు ప్రాణాలను కోల్పోయారని పేర్కొన్నారు.

ప్రజా రక్షణ కోసం, భవిష్యత్తు తరాల కోసం,  పోలీసులు అహర్ని శలు తమ ప్రాణాలను లెక్కచేయకుండా విధులు నిర్వహిస్తున్నారన్నారు.

ప్రస్తుత పరిస్థితులలో జిల్లాలో అధికార యంత్రాంగం ప్రశాంతంగా విధులు నిర్వహిస్తున్నరంటే అనాటి పోలీసు త్యాగాల ఫలితంగానే అన్నారు. నక్సలైట్ల ప్రభావితమైన ఖమ్మం ఉమ్మడి జిల్లాలో గతంలో పోలీస్ సిబ్బంది పోలీస్ వాహనాలలో తిరిగే పరిస్థితి వుండేది కాదని, ఆర్టీసీ బస్సులలో ప్రయాణం చేసి తీవ్రవాద కార్యకాలాపాలను అదుపు

చేయగలిగారని అన్నారు. అలాంటి సందర్భంలో కూడా పోలీసు తమ అముల్యమైన ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు వున్నాయని అన్నారు.

పోలీస్ కమిషనర్ విష్ణు యస్. వారియర్ మాట్లాడుతూ ...

1959 అక్టోబరు 21న పంజాబ్ కు చెందిన 21 మంది సభ్యుల బృందం సరిహద్దుల్లో విధులు నిర్వర్తిస్తుండగా, చైనా రక్షణ బలగాలు సియాచెన్ భూభాగాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నించడంతో సీఆర్పీఎఫ్ దళం హాట్ స్ప్రింగ్స్ ప్రాంతంలో దీటుగా ఎదురొడ్డి పోరాడి పది మంది భారత జవాన్లు ప్రాణాలను కోల్పోయారని,

అనాటి నుండి దేశవ్యాప్తంగా విధినిర్వహణలో అసువులుబాసిన పోలీసులను స్మరిస్తూ, ప్రతి ఏడాది అక్టోబరు 21న పోలీసు అమరవీరుల సంస్మరణ దినంగా పాటించడం జరుగుతుందన్నారు.

ఎన్నో ఏళ్లుగా ఇంటి స్థలం ఎదురుచూస్తున్న ఖమ్మం పోలీస్ అమరవీరుల  కుటుంబ సభ్యులకు జిల్లా కలెక్టర్ గారి చోరవతో 22 మంది కుటుంబ సభ్యులకు ఇండ్ల పట్టాలు ఇవ్వడం జరిగిందన్నారు.

పోలీస్ అమరవీరుల వారోత్సవాలలో భాగంగా

అక్టోబర్ 25 & 27న సైకిల్ ర్యాలీ, 26వ తేదీన రక్తదానం శిభిరం, 27వ తేదీన పోలీస్ సిబ్బందికి వ్యాసరచన పోటీలు , 28 వ తేదీన ఆన్‌లైన్ ఓపెన్ హౌస్, మరియు విద్యార్థులకు ఆన్‌లైన్  వ్యాసరచన పోటీలు,  అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.